క్లుప్తంగా...

21 నుంచి రెండో విడత కౌన్సెలింగ్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2023–24 డిప్లొమా కోర్సుల ప్రవేశం కోసం ఈ నెల 21, 22 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ వెంకటరమణ తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పాలిటెక్నిక్‌తో పాటు విశ్వవిద్యాలయంచే గుర్తింపు పొందిన ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో రెండు సంవత్సరాల వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయ డిప్లొమా కోర్సులకు, మూడు సంవత్సరాల డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ కోర్సులకు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సీట్ల కేటాయింపు పాలిసెట్ 2023 ర్యాంకులు, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం జరుగుతుందన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

శంషాబాద్: పట్టణంలోని హుడా కాలనీలో నిర్మించిన బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని నేడు మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరవుతారన్నారు.

నార్సింగి ఏసీపీగా లక్ష్మీనారాయణ



మణికొండ: నార్సింగి ఏసీపీగా ఎస్. లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జి.వెంకటరమణగౌడ్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నార్సింగి డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో కృషిచేస్తానని ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు.

దళితుల హక్కుల సాధనకు కృషి చేయాలి



జిగ్నేష్‌ను సన్మానిస్తున్న నరేందర్

శంషాబాద్: దళితుల హక్కుల సాధన కోసం కృషి చేయాలని గుజరాత్ రాష్ట్ర వడ్గాం నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్రీయ దళిత్ ఆధార్ మంచ్ కన్వీనర్ జిగ్నేష్‌మెవాని సూచించారు. పీసీసీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ప్రీతమ్ ఆధ్వర్యంలో బుధవారం శంషాబాద్‌లో ఆయనను పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్‌తో పాటు ఎస్సీసెల్ నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. దళితుల ఉన్నతికి కాంగ్రెస్ చేసిన కృషి ఏ పార్టీ చేయలేదన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా గుజరాత్‌లో దళితుల హక్కుల సాధన కోసం చేస్తున్న కృషిని ఆయన వివరించారు.

కాంగ్రెస్ నాయకుల పర్యటన



ప్రేమ్‌నగర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. 3 రోజులుగా కురుస్తున్న నానుడు వానకు ప్రేమ్‌నగర్‌లోని రోడ్డు నంబర్ 6లో ముక్రం ఇల్లు వర్షానికి కూలిపోయింది. అలాగే వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థిక సహాయం అందించారు. ఈ పర్యటనలో నాయకులు నరేందర్ యాదవ్, ఖాజా పాషా, ఇస్మాయిల్, అఫ్రోజ్ ఖాన్, భరత్‌గాంధీరెడ్డి, అనిల్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు



రాయదుర్గం: స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా టీ వర్క్స్‌తో డస్సాల్ట్ సిస్టమ్స్ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం రాత్రి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ–వర్క్స్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. టీవర్క్స్ సీఈఓ, తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ మాట్లాడుతూ స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయడానికి డస్సాల్ట్ సిస్టమ్స్‌తో భాగస్వామ్యం చేసుకోవడంతో 3డి ఎక్స్‌పీరియన్స్ వర్క్స్ వంటి సరికొత్త సాంకేతికతలతో కేంద్రాన్ని మరింత సన్నద్ధం చేయడం సాధ్యమవుతుందన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోండి

కమిషనర్ శరత్‌చంద్ర



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో కమిషనర్ బి.శరత్ చంద్ర బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. కార్పొరేషన్ పరిధిలోని 15, 16, 17వ డివిజన్‌లలో శానిటేషన్ నిర్వహణను పరిశీలించి చెత్తను ఇంటి వద్దకు వచ్చే కార్మికులకు అందించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షం కారణంగా ప్రజలకు అసౌకర్యం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గాలి, వానకు చెట్లు కూలిపోతే వెంటనే వాటిని తొలగించాలన్నారు. ఇంటి వద్దనే తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి కంపోస్టు తయారీ చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షానికి జీవీ పాయింట్స్‌ను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. సిబ్బంది విధిగా వర్షం ఉన్నప్పుడు రెయిన్ కోర్టులు, గ్లౌజ్‌లు, మాస్కులు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ రవి, హెల్త్ అసిస్టెంట్ నరేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, వెంకటేష్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రకుంటను అభివృద్ధి చేయాలి..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర పర్యటన నేపథ్యంలో యువ నాయకుడు టింకురెడ్డి ఆధ్వర్యంలో 16వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎర్రకుంట చెరువు అభివృద్ధి జరగడం లేదని రూ. 47 లక్షలకు కౌన్సిల్ తీర్మానం చేసినా ఇంకా టెండర్లు పిలవలేదన్నారు. ఫెన్సింగ్ టెండర్ పూర్తయినా పనులు మాత్రం జరగం లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

రోడ్లకు మరమ్మతులు చేస్తాం



నీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ సూచించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో హెచ్ఎండీఏ అధికారులు, ఈఈ అప్పారావుతో కలిసి పర్యటించారు. రిచ్‌మండ్ వల్లా నుంచి వై జంక్షన్ వరకు, మ్యాపిల్ టౌన్ నుంచి పపాలాల్ స్వీట్ హౌజ్ వరకు బీటీ రోడ్లు వేసేందుకు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లోని అన్ని ప్రధాన రహదారులను ఆధునీకరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాల కారణంగా రోడ్లు గోతులమయంగా మారుతుండటంతో అందులో నీరు నిలిచి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాపయ్యయాదవ్, డీఈ యాదయ్య, హెచ్ఎండీఏ ఏఈ ముకరం పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం

అత్తాపూర్: గత రెండ్రోజులు కురుస్తున్న వర్షాలతో ఇళ్లల్లోంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై నిలిచిన వరద నీటితో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బుధవారం కురిసిన వర్షానికి హైదర్‌గూడ, అత్తాపూర్, రాంబాగ్, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి తదితర ప్రాంతాల్లో వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి.

తైక్వాండోలో సత్తా



రిషికా, సహర్షను అభినందిస్తున్న కోచ్‌లు

రాజేంద్రనగర్: ఉత్తమ శిక్షణ, పట్టుదల ఉంటే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని కోచ్ ప్రదీప్‌కుమార్, సురేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్రస్థాయి తైక్వాండో క్యోరుగి పోటీలలో బంగారు పతకాలు సాధించిన రిషికా, సహర్షలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 17న మెదక్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో క్యోరుగి పోటీల్లో కాడేట్ క్యోరుగి, పూంసే విభాగాల్లో అత్తాపూర్‌కు చెందిన రిషికా, సహర్ష ప్రతిభ కనబర్చారన్నారు. పోటీలో గెలుపొందిన వీరు ఉత్తరప్రదేశ్ లక్నోలో జరిగే కాడేట్ నేషనల్(జాతీయ) ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు కోచ్‌లు తెలిపారు.

దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ ఫిర్యాదు

రాజేంద్రనగర్: తమపై దౌర్జన్యం చేయడంతో పాటు జాగిలాలను ఉసిగొలిపి హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ మైలార్‌దేవ్‌పల్లి టీఎన్‌జీవోస్ కాలనీకి చెందిన దంపతులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. టీఎన్‌జీవోస్ కాలనీలో వెంకటేష్–ఉమాదేవి దంపతులు 16 సంవత్సరాల క్రితం స్థలాన్ని కొని ఇంటిని నిర్మించుకుని ఉంటున్నారు. ఈ స్థలం తాము కొనుగోలు చేశామంటూ ఇదే ప్రాంతానికి చెందిన మహిపాల్, ఎంజాల రాజుతో పాటు మరికొందరు బుధవారం ఉదయం వెంకటేష్ ఇంటి వద్దకు వచ్చారు. జేసీబీతో పాటు కుక్కలను తీసుకువచ్చి ఇంటిని కూల్చేందుకు ప్రయత్నించారు. అడ్డుకున్న వెంకటేష్, ఉమాదేవిలపై దాడికి పాల్పడ్డారు. దీంతో వెంకటేష్, ఉమాదేవి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు పిర్యాదు చేశారు. ఇరువర్గాలను స్టేషన్‌కు రప్పించిన పోలీసులు దస్తావేజులను పరిశీలిస్తున్నారు.

అసంపూర్తి పనులు.. వాహనదారులకు ఇక్కట్లు



మణికొండ: డ్రైనేజీ పనులు చేసి అలాగే వదిలేయటంతో రోడ్డు కుంగి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ గార్డెన్ కాలనీలో ఇటీవల డ్రైనేజీ పనులను చేపట్టారు. పూర్తయిన తర్వాత కేవలం మట్టిపోసి వదిలేశారు. వర్షాలు కురుస్తుండటంతో మట్టి మెత్తబడి వాహనాలు భూమిలోకి దిగబడుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. బుధవారం ఓ స్కూల్ బస్సు అందులో కూరుకుపోవడంతో విద్యార్థులు కాలినడకన పాఠశాలకు వెళ్లాల్సి వచ్చింది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మణికొండ: గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట రాజేంద్ర వైన్స్ వద్ద 40–45 సంవత్సరాల వయసున్న ఓ వ్యక్తి గోతిలోపడి చనిపోయి ఉన్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు బ్లూకలర్ జీన్స్, తెలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నాడని సంబంధీకులు ఎవరైనా ఉంటే నార్సింగి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవన నిర్మాణం చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్: నిత్యం వేలాది మంది రోగులు వచ్చే ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి వెంటనే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించకపోతే తమ కార్యాచరణ ప్రకటించి ఆందోళన చేపడతామని జేఏసీ ఫర్ న్యూ ఓజీహెచ్ ప్రతినిధి, జూనియర్ డాక్టర్ పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రిలోని అవుట్ పేషంట్ బ్లాకు వద్ద జేఏసీ ప్రతినిధులు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హారీష్ రావు ఉస్మానియా నూతన భవనం కోసం వారం రోజుల్లో హైకోర్టుకు వెళ్తామని చెప్పి పదిహేను రోజులు గడుస్తున్నా ఆ దిశగా ఎలాంటి కార్యాచరణ లేదన్నారు. ఆస్పత్రికి నూతన భవనం కోసం దాదాపు 10 సంవత్సరాలుగా వైద్యులు నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆస్పత్రిలో స్థలం సరిపోక అటు రోగులు ఇటు వైద్యులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆస్పత్రికి వచ్చే పేద రోగులను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని లేని పక్షంలో జేఏసీ తరపున తమ కార్యాచరణ ప్రకటించి ఆందోళనకు దిగుతామన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్: తాగుడుకు బానిసైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని ఎంఏనగర్‌లో కూతాడి వేణు (42) భార్య ఉపేంద్ర ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. వేణు ఆటో డ్రైవర్. గత కొంతకాలంగా వేణు తాగుడుకూ బానిసై ఏ పని చేయకుండా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వేణు భార్య పిల్లలతో కలిసి అదే కాలనీలో ఉంటున్న తల్లిగారింటికి వెళ్లింది. ఇంట్లో వేణు ఒక్కడే ఉన్నాడు. బుధవారం ఉదయం 7.30 గంటలైనా వేణు నిద్రలేవకపోవడంతో సోదరుడు కుమార్ తలుపు తట్టగా పలుకలేదు. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా వేణు చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. మృతుడి సోదరుడు కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆర్టీఏ జాయింట్ కమిషనర్‌కు సిబ్బంది అక్రమాల అవినీతిపై ఫిర్యాదు



జాయింట్ కమిషనర్ పాండురంగ నాయక్‌ను కలిసిన టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేన్

అబిడ్స్: ఆర్టీఏ కార్యాలయంలో అవినీతి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీఏ జాయింట్ కమిషనర్ పాండురంగ నాయక్‌ను కలిసి ఆర్టీఏ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు చేస్తున్న అక్రమాలపైన ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఇద్దరు ఉద్యోగులు తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మూడురోజులలోపు ఆ ఇద్దరి ఉద్యోగులపై చర్యలు తీసుకోనిచో తమ టీఎన్జీఓస్ కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పాండురంగనాయక్ సానుకూలంగా స్పందించారు. విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విక్రమ్ కుమార్, కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, శ్రీధర్, అరుణేందర్, పవన్, కాలీద్ అహ్మద్, శంకర్, వైదిక్ శాస్త్రి, ముఖీమ్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

గచ్చిబౌలి: మహిళ అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ జిల్లా రాపోల్ మండలం ఉదయ్‌పూర్‌కు చెందిన అంజయ్య, శాంత దంపతులు నగరానికి వలస వచ్చి గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. వారికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. కూతురు మమత(25) మాదాపూర్‌లోని ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేస్తుంది. రోజు మాదిరిగానే ఇంట్లో చెప్పి ఈనెల 17వ తేదీన ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. రాత్రి 7.30 గంటలకు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. వెంటనే ఆమె చిట్‌ఫండ్ కంపెనీకి వెళ్లి ఆరా తీయగా ఆమె ఉద్యోగంలో చేరిన రెండు రోజులు మాత్రమే వచ్చిందని, ఆ తర్వాత మానివేసిందని తెలిపారు. దీంతో తెలిసిన వారు, బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల్లో మానసిక రుగ్మతల నివారణకు ఫోన్ ఇన్

గోల్కొండ: పిల్లలలో ఏర్పడిన మానసిక రుగ్మతలను నివారించేందుకు నేటి నుంచి ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని ప్రతి రోజు నిర్వహిస్తామని తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంఏ కరీం తెలిపారు. పిల్లలకు అందుబాటులో ఫోన్‌లు ఇవ్వడం వల్ల వారి జీవన శైలి మారిందని, ఫోన్‌లు బాల్య దశలోనే మానసిక రుగ్మలకు గురవుతున్నారని ఆయన అన్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తల్లిదండ్రులకు, సాయంత్రం 7 నుంచి 8 వరకు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ ఆరోగ్య అంశాలపై ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వివరాలకు 94404 88571 నెంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

ప్రభుత్వ భూమికి ఎసరు !

- ప్రైవేటు భూమిగా నిర్ధారించిన సర్వేయర్
- కలెక్టర్ దృష్టికి వెళ్లటంతో అడ్డుకట్ట

మణికొండ: ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల విలువైన భూమిని ప్రైవేటు వ్యక్తిది అంటూ ఓ ప్రబుద్ధుడు రెవెన్యూ స్కెచ్ వేసి కట్టబెట్టాడు. అలా హక్కులు పొంది ఏకంగా హెచ్ఎండీఏకు 40 అంతస్తుల భవన నిర్మాణానికి దరఖాస్తు చేశారు. ఆ విషయం జిల్లా కలెక్టర్ హరీష్ దృష్టికి వెళ్లడంతో అనుమతులకు చెక్ పడింది. వివరాలిలా.. గండిపేట మండలం, మంచిరేవుల రెవెన్యూలో సర్వే నెంబర్ 487లో 8.24 ఎకరాల నాగిరెడ్డికుంట భూమి ఉంది. దాని పక్కనే 5 ఎకరాల అర్బన్ ల్యాండ్ సీలింగ్(యూఎల్‌సీ) భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయి. సదరు యూఎల్‌సీ భూమిపై కోర్టులోనూ కేసులు ఉన్నాయి. అవేమి పట్టించుకోకుండా సనాలీ రియల్ ఎస్టేట్ సంస్థ సదరు భూమి తమదని దానికి సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కోరగా ఇదే అదునుగా భావించిన సర్వేయర్ పెద్ద మొత్తంలో దండుకుని వారు అడిగిన విధంగా భూమి సర్వే నివేదికను అందజేశారు. అప్పటికే రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సహాయంతో తయారు చేసుకున్న డాక్యుమెంట్లను దాంతో జతచేసి ఏకంగా హెచ్ఎండీఏకు 39 అంతస్తులలో హైరైజ్ ఐటీ పార్కుకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. హెచ్ఎండీఏలోని ఉన్నతాధికారులను సైతం సదరు సంస్థ మచ్చిక చేసుకోవడంతో ఏకంగా ప్రభుత్వ భూమిలో ప్రైవేటు సంస్థకు ఆగమేఘాల మీద అనుమతులను జారీ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డుకు పక్కనే ఐటీజోన్‌కు సమీపంలో మంచిరేవులలో ఉన్న కుంట, యూఎల్‌సీ భూమిలో ఏకంగా హెచ్ఎండీఏ అనుమతులు తీసుకుని భవనాన్ని నిర్మిస్తున్నారని కొందరు జిల్లా కలెక్టర్ హరీష్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో వెంటనే స్పందించిన ఆయన రాజేంద్రనగర్ ఆర్డీఓ చంద్రకళతో విచారణ జరిపించారు. విచారణలో అది నిజమేనని తేలటంతో అనుమతులను రద్దు చేసి నోటీసులు జారీ చేసినట్టు సమాచారం.

ఘనంగా ఫలహార బండ్ల ఊరేగింపు



ఫలహారం బండ్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌కు చెందిన బి.బాలరాజ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండ్ల ఊరేగింపు ఆకట్టుకుంది. కళాకారుల ప్రదర్శనలతో ఊరేగింపు వైభవంగా కొనసాగింది. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు తెలంగాణ సాంస్కృతికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. గత 20 సంవత్సరాలుగా అంగరంగ వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి.సత్యనారాయణముదిరాజ్, బాబురావు, ఎన్.మల్లారెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, కోరని మహాత్మా పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

స్వల్ప ఉద్రిక్తత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

శంషాబాద్: హిమాయత్‌సాగర్ సమీపంలోని కొత్వాల్‌గూడ సర్వే నంబరు 52, 53 బఫర్‌జోన్‌లో మట్టివేసి నిర్మాణాలు చేపడుతున్న వాటిని బుధవారం శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులు కూలివేశారు. టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూల్చివేతలను ప్రారంభించిన వెంటనే భూ యజమానికి సంబంధించిన మనుషులు అక్కడికి చేరుకుని హల్‌చల్ చేశారు. తమ భూముల్లోకి అక్రమంగా ఎందుకు ప్రవేశించారంటూ మున్సిపల్ అధికారులకుపైకి తిరగబడ్డారు. కూల్చివేతలను అడ్డుకునేందుకు అడగడుగునా ప్రయత్నించారు. అయినా ప్రీకాస్టింగ్‌తో పెట్టిన గోడలను అధికారులు కూల్చివేశారు. అధికారుల వీధులకు ఆటంకం కలిగించడంతో పాటు భయభ్రాంతులకు గురిచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులను అందజేస్తున్న రఘునాథ్‌యాదవ్

శేరిలింగంపల్లి: ఇష్టపడి చదివితేనే విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని రఘునాథ్ ఫౌండేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్‌యాదవ్ తెలిపారు. రఘునాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులను బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రఘునాథ్‌యాదవ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఆర్థిక కారణాలతో ఏ విద్యార్థి చదువు ఆగకూడదని వారికి రఘునాథ్ ఫౌండేషన్ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్. శంకర్, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు గఫూర్, రాములు గౌడ్, అక్బర్, సలీం, భరత్‌యాదవ్, పవన్, రాజలింగం, ముక్రమ్, జావేద్, నారాయణ, రషీద్, అలీ, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

తోటి విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ డా.హరీష్



విద్యార్థులతో కరచాలనం చేస్తున్న కలెక్టర్ హరీష్

గచ్చిబౌలి: విద్యార్థుల ప్రవర్తన ఇతరులకు, తోటి విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని రంగారెడ్డిజిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ హరీష్ సూచించారు.కొండాపూర్‌లోని చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ ఇన్‌వెస్టిట్యూర్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ ఎంపిక చేసిన విద్యార్థులకు బ్యాడ్జెస్ ప్రధానం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

148 కిలోల గంజాయి స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్ .. పరారీలో ఇద్దరు
- కేసు వివరాలను వెల్లడించిన మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో స్కోడా కారులో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. బుధవారం రాత్రి గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆమె వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన నకుల్ కై లాస్ గైక్వాడ్(32) విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి ఎక్కువ డబ్బులు సంపాదించాలని గంజాయి వ్యాపారం ప్రారంభించాడు. పెద్దబొడ్డుపల్లి, నర్సీపట్నం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శివ వద్ద కిలో రూ.5000 చొప్పున 148.66 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. ముంబైకి చెందిన గంజాయి వ్యాపారి సంతోష్‌కు అమ్మాల్సి ఉంది. నర్సీపట్నం నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు చేరుకున్నారు. మాదాపూర్‌లోని యశోద హాస్పిటల్ లింకు రోడ్డులో స్కాడా కారులో గంజాయి ఉన్నట్లు మాదాపూర్ ఎస్ఐ రవికిరణ్‌కు విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ గైక్వాడ్ గంజాయి రవాణ కేసులో రాజమండ్రి పోలీసులు జైలుకు పంపారు. నర్సీపట్నంకు చెందిన శివ, ముంబైకి చెందిన సంతోష్‌లు పరారీలో ఉన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహ్మారెడ్డి, ఏసీపీ పి.శ్రీనివాస్, మాదాపూర్ సీఐ తిరుపతి, ఎస్‌ఓటీ సీఐ శివ, డీఐ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి